తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-28-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:123 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




# యువత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుంది

- అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలి
- ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా 2000 రూపాయల స్టయిఫండ్ ఇస్తాం
- 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడంలో యువత కృషి చేయాలి
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణలోని యువతీ యువకులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నైపుణ్యత కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు విదేశాల్లో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చిన నేపథ్యంలో మల్లేపల్లి ఐటీఐ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలను విర్చువల్‌గా ప్రారంభించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న మల్లేపల్లి ఏటీసీని పరిశీలించారు.

మిగతా 2లో..

# నీట మునిగిన హైదరాబాద్!

- నగరంలో మూసీ నది ఉగ్రరూపం
- చాదర్‌ఘాట్, పురానాపూల్, ఎంజీబీఎస్, మూసారాంబాగ్ ప్రాంతాలను ముంచెత్తిన వరద
- సహాయక చర్యల్లో హైడ్రా, రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

భారీ వర్షాలతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుండి నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. చాదర్‌ఘాట్, పురానాపూల్, ఎంజీబీఎస్, మూసారాంబాగ్ తదితర ప్రాంతాలను వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో అధికారులు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తున్నారు. హైడ్రా, రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

మిగతా 2లో..



## వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయబోరు

- బీఆర్ఎస్‌లో చేరిన కొడంగల్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై రగిలిపోతున్నారని వ్యాఖ్య
- కొడంగల్‌కు రేవంత్ రెడ్డి చక్రవర్తి ఏమీ కాదన్న కేటీఆర్

2లో





## ఎన్నికల ముందు రజనీకాంత్.. తర్వాత గజనీకాంత్ ..

- రేవంత్‌పై హరీశ్‌రావు మాస్ సెటైర్లు
- కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతాం
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

2లో


# చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలి

**బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? : కోర్టు**

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:**

చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. బీసీ రిజర్వేషన్ల జీవోపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు శనివారం విచారించింది. రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని మాధవరెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన మాధవరెడ్డి.. బీసీ రిజర్వేషన్లను 27% నుంచి 42శాతానికి పెంచారని ఆరోపించారు.

మిగతా 2లో..






తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# యువత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం అక్కడ జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నైపుణ్యం పెంచుకోవడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. "ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా 2000 రూపాయల స్టయిఫండ్ ఇస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఇది ఖర్చు కాదు. భవిష్యత్తుకు పెట్టుబడి. పని చేయాలన్న సంకల్పం కావాలి. కష్టపడి పనిచేయాలి. మీకు ఉద్యోగావకాశాలు, పాస్‌పోర్టు తదితర సర్వీసును అందించడానికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తాం. మీ భవిష్యత్తుకు పునాదులు వేస్తాం.

ఏటీసీల్లో శిక్షణ పొందిన తమ్ముళ్లు, చెల్లెళ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడంలో మీ వంతు కృషి చేయాలి. అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతోనే యువతలో సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాష్ట్రంలో 1956లో ప్రారంభమైన ఐటీఐలు, క్రమేణా 65 ఐటీఐలకు పెరిగినప్పటికీ గత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదు. మారిన కాలానికి ఈ కేంద్రాలు ఏమాత్రం సంబంధం లేకుండా పాతకాలపు ఒరవడిలో నడిచాయి. వాటిని సమూలంగా మార్చి ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నాం. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలో 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడానికి ప్రభుత్వం కేవలం 300 కోట్లు ఖర్చు చేస్తే టాటా సంస్థ 2100 కోట్లు ఖర్చు చేసి ఆధునిక ఏటీసీలను తీర్చిదిద్దారు. మన వద్ద డబ్బుకన్నా ఆలోచన, చిత్తశుద్ధి ఉండాలి. చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు.

ప్రస్తుతం 65 ఏటీసీలకు అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో 51 ఏటీసీలను ప్రారంభిస్తాం. ఈ 116 ఏటీసీలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాయి. ఒకప్పుడు ఐటీఐల్లో చదువుకున్న వారికి ఆర్టీసీలో అప్రెంటిస్ చేయడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రెంటిషిప్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలి. రాష్ట్రంలో ప్రతి ఏటా 1 లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందుతున్నప్పటికీ నైపుణ్యం లేని కారణంగా చాలా మందికి ఉద్యోగావకాశాలు రావడం లేదు. నైపుణ్యం లేనిదే ప్రైవేటు కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే స్కిల్స్ పెంచాలన్న అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటివి ప్రారంభించామంటే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నదే మా సంకల్పం.

చేతుల్లో డిగ్రీలు ఉన్నా స్కిల్స్ లేకపోతే ప్రయోజనం లేదు. నైపుణ్యత కలిగిన వారికి దక్షిణ కొరియా, జర్మనీ, జపాన్, రష్యా లాంటి దేశాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కేవలం ఐటీ చదివితేనే ఉద్యోగాలొస్తాయన్న అపోహల్లో బతుకుతున్నాం. అది తప్పు. ఏటీసీల్లో చదువుతున్న యువత నైపుణ్యత సాధించడంపై ఫోకస్ పెట్టాలి. చదువు ఒక్కటే సమాజంలో అసమానతలు రూపుమాపుతుంది. మీకు గౌరవం దక్కుతుంది. చదువు, సాంకేతిక నైపుణ్యం ఒక్కటే మీ తలరాతను మార్చుతుంది. ఈ ప్రభుత్వం మీకు అవకాశాలు, వసతులను ఏర్పాటు చేస్తుంది. చదువుకుని రాణించండి. చదువు లేకపోతే, నైపుణ్యం లేకపోతే ఎందుకూ కొరకాకుండా పోతారు.. అని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారితో పాటు ఉన్నతాధికారులు, టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు, ఏటీసీ విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఏటీసీల నుంచి స్థానికంగా ప్రజాప్రతినిధులు, విద్యార్థులు వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు.

# చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతం దాటిందని.. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పిటిషనర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? అని కోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇవ్వలేదు. దాంతో గెజిట్ చేయకముందే హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించిన కోర్టు ప్రశ్నించింది. బీసీల రిజర్వేషన్ల జీవో గెజిట్ కాకపోవచ్చని హైకోర్టుకు తెలిపిన ఏజీ సుదర్శన్‌రెడ్డి. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మాత్రమే ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ పరిమితి 67శాతానికి చేరిందని.. బీసీ రిజర్వేషన్లు 35శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారన్నారు. 2018లో ఇచ్చిన జీవోను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని తెలుపగా.. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టి రిజర్వేషన్ పెంచారని చెప్పిన పిటిషన్ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏని సవరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని.. అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండిరగ్‌లో ఉందన్నారు. స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ తరఫు న్యాయవాదిని హైకోర్టు అక్టోబర్ 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సమయం కోరారు. బీసీల రిజర్వేషన్లపై చట్ట ప్రకారమే ముందుకెళ్లాలని.. ఈ మేరకు విచారణ అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేసిన డివిజన్ బెంచ్ వాయిదా వేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా పిటిషన్‌ను విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది.





# నీట మునిగిన హైదరాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

మంజీరా నదికి పోటెత్తుతున్న వరదసంగారెడ్డి, మెదక్ జిల్లాలను మంజీరా నది వరద వణికిస్తోంది. సింగూరు, మంజీరా బ్యారేజీల నుంచి మంజీరా నదికి భారీ వరద వస్తోంది. మంజీరా ఉగ్రరూపానికి ఏడుపాయల వనదుర్గా ఆలయం గత కొన్ని రోజులుగా వరద నీటిలోనే ఉంటోంది. వరద ధాటికి ఆలయం వద్ద ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. అమ్మవారి ఆలయానికి వచ్చే దారులన్నీ మూసివేశారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు నది వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.



## వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయబోరు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశమని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ గెలవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు బంధు పథకాన్ని రేవంత్ రెడ్డి బంద్ చేస్తారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి గురించి అందరి కంటే ఎక్కువగా కొడంగల్ ప్రజలకే తెలుసని కేటీఆర్ అన్నారు. కొడంగల్‌కు రేవంత్ రెడ్డి చక్రవర్తి ఏమీ కాదని, ఆయనపై ప్రజలకు ఆగ్రహం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే కొడంగల్ నియోజకవర్గానికి తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. ఆయనకు కలెక్టర్, ఎస్పీ వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు రిబ్బన్ కట్ చేస్తున్నారని, అందుకే జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

## ఎన్నికల ముందు రజనీకాంత్.. తర్వాత గజినీకాంత్ ..

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క బాండు పేపర్‌పై సంతకాలు పెట్టి ఎన్నికల హామీలు ఇచ్చారని.. కానీ ఎన్నికల హామీలపై ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇవాళ (శనివారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు హరీశ్‌రావు. కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతామని చెప్పుకొచ్చారు. బాకీ కార్డు చూపించి ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో కార్మికులు, వ్యవసాయ కార్మికులు సైతం మోసపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి.. ఎన్నికల ముందు రజనీకాంత్.. ఎన్నికల తర్వాత గజినీకాంత్ మాదిరిగా మారిపోయారని ఎద్దేవా చేశారు హరీశ్‌రావు. రేవంత్.. చీఫ్ మినిస్టర్ కాదు.. రేవంత్ రెడ్డి కటింగ్ మాస్టర్ అని సెటైర్లు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్ చేసే పనిలో రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని ఆక్షేపించారు. ఆరు గ్యారెంటీలపై తెలంగాణ అసెంబ్లీలో చర్చిదామంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిపోయారని దెప్పిపొడిచారు. మార్పు మార్పు అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి ఏమార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గల్లీ గల్లీ తిరిగిన గాంధీలు.. ఇప్పుడు ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు ప్రశ్నిస్తారని గాంధీలు హైదరాబాద్‌కు రాకుండా ముఖం చాటేశారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.



## పేదలందిరికీ ఇందిరమ్మ ఇండ్లు

### రసూల్ పురలో 288 డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ లోని రసూల్ పురలో హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి, కంటోన్మెంట్ సీఈవో నాయక్‌తో కలిసి 288 మంది పేదవారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగింది.గత ప్రభుత్వం రసూల్ పురలో మొండి గోడలతో వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చినప్పుడు 6,7 నెలల్లో పూర్తి చేసి ఇస్తామని గతంలో నేను హామీ ఇచ్చాను. ఆ హామీ మేరకు ప్రణాళికా బద్ధంగా, యుద్ధ ప్రాతిపదికన ఆ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశాము. పేదవారికి ఇండ్లు కట్టిస్తే తమకేం వస్తుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వకుండా కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది. కానీ పేదవారి ఆత్మ గౌరవానికి ప్రతీకైన సొంతింటిని ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వం లక్ష్యం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. పరిధిలో అర్హులైన వారికి వారున్న చోటనే అపార్ట్ మెంట్ల మాదిరిగా ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కూడా త్వరలోనే పూర్తి చేసి పేదలకు అందిస్తాం. కంటోన్మెంట్ ప్రజలకు ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెబుతుంది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరినట్టుగా గతంలో పేదల కోసం కట్టించిన అపార్ట్ మెంట్లకు మరమ్మతులు చేయిస్తాం. అదేవిధంగా కంటోన్మెంట్ ఏరియాలో ఇండ్లు కట్టుకున్న పేదలను ఆర్మీ అధికారులు ఇబ్బంది పెట్టకుండా స్థానిక ఎం.పి. ఈటెల రాజేందర్ కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు తేవాలని కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం నెరవేస్తుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం-28- సెప్టెంబర్ 2025


# దళిత రత్న అవార్డు అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్

**హైదరాబాద్,సెప్టెంబర్27 (తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలు–2025లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే దళితరత్న అవార్డును ఈసారి హన్మకొండ జిల్లా తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ఎడిటర్, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్ అందుకున్నారు.ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ ఈ విషయాన్ని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో కమిటీ వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా బొల్లెపాక రాజేష్ అవార్డును






స్వీకరించారు.

అవార్డు స్వీకరించిన అనంతరం బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ, “ఈ గౌరవం వ్యక్తిగతంగా నాకు మాత్రమే కాకుండా, జర్నలిజం రంగంలో కష్టపడుతున్న ప్రతి దళిత పాత్రికేయుడికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నాను. సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే బాధ్యత మనదని, అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, న్యాయం కోసం కలం పాడుతుంది. పేదల సమస్యలు, అణగారిన వర్గాల సమస్యలు వెలుగులోకి తెచ్చేందుకు నా జర్నలిస్టు ప్రస్థానాన్ని మరింత అంకితం చేస్తాను” అని పేర్కొన్నారు. అవార్డుకు ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, అంబెడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్, మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుల నాగేందర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వీరేందర్ మాదిగ, దళిత సంఘాల నాయకులు రమేష్, సుమన్, నిర్మల్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి లో బతుకమ్మ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

**టీజీవో జిల్లా అధ్యక్షులు వరప్రసాద్ రావు**

**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల గోడపత్రికను ఘనంగా ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా టీజీవో సంఘం సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది.

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ, “బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే ప్రత్యేక పండుగ. మహిళల సాంస్కృతిక భాగస్వామ్యం విశేషం” అని తెలిపారు.

వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి మాట్లాడుతూ, “బతుకమ్మ పండుగ పల్లెల నుండి పట్టణాల వరకు ఉత్సాహాన్ని నింపుతుంది. పండుగల ద్వారా తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి తరతరాలకు చేరతాయి” అన్నారు.



జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ, “బతుకమ్మ పూల పండుగ మహిళల సృజనాత్మకత, సమైక్యతకు చిహ్నం” అని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ మాట్లాడుతూ, “గోడపత్రిక ద్వారా పండుగ సాంస్కృతిక ప్రాముఖ్యత మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుంది” అన్నారు.

వనపర్తి జిల్లా టీజీవో అధ్యక్షులు ఎస్. వరప్రసాద్ రావు, కార్యదర్శి ఎన్. సురేష్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ, “ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలను మరింత వైభవంగా నిర్వహించాలి” అని తెలిపారు. అదేవిధంగా అసోసియేషన్ ప్రతినిధులు ప్రభాకర్, ప్రశాంత్ గౌడ్, అఖిల్, నరసింహారెడ్డి, శ్రీమతి వరలక్ష్మి, శ్రీమతి రేవతి, శ్రీకృష్ణ, శివతేజ, పర్వతాలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, పూలతో బతుకమ్మలు అలంకరించి సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.





# ప్రస్తుత పట్టణాలను విస్మరిస్తున్న ప్రభుత్వం

- పట్టణాలను విస్మరించడం అంటే పేదలను పట్టించుకోకపోవడమే
- సిపిఐ (ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రస్తుత నగరాలను విస్మరించి ఫ్యూచర్ సిటీలను నిర్మించడం వల్ల పేద ప్రజలకు ఏమి ఉపయోగమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఖమ్మం నగర పరిది లోని త్రీ టౌన్ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని,త్రీ టౌన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఐ (ఎం) ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బోస్ సెంటర్ నుండి కాల్వ ఒడ్డు సెంటర్ వరకు నిర్వహించిన పాదయాత్ర ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆయన 31వ డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి అధ్యక్షతన జరిగిన సభలో పోతునేని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తూ మేము తెలంగాణ రాష్ట్రాన్ని బాగా అభివృద్ధి చేస్తామని భారతదేశంలో ఉన్న రాష్ట్రాలతో మా పోటీ కాదు ప్రపంచంలో ఉన్న ముఖ్యమైన నగరాలతో మేము పోటీ పడతామని చెప్పి పాత నగరాలను విస్మరించి ఫ్యూచర్ సిటీలు నిర్మిస్తామని ఎంతో గొప్పలు చెప్తున్నారని ఆరోపించారు. ఒకపక్క పాత నగరాలు ప్రజా సమస్యల నిలయంగా మారుతున్నాయని పాత నగరాలు పట్టించుకోకుండా ఫ్యూచర్ సిటీ నిర్మించడం వల్ల ఉపయోగం ఏమిటని ఆయన ఈప్రభుత్వాన్ని ప్రశ్నించారు.పేద ప్రజలు ఎక్కువగా నివసించేది పాత నగరాలలో నని ,పాత నగరాలను విస్మరించడం అంటే పేద ప్రజలను అభివృద్ధి నుంచి దూరం చేయడమేనని అన్నారు.వారి సమస్యలను గాలికి వదిలేయడమే అని ప్రభుత్వాన్ని విమర్శించారు .తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన జిల్లాల్లో ఖమ్మం జిల్లా ఒకటి అని,అలాంటి ఖమ్మం జిల్లా నడిబొట్టున ఉండి వ్యాపార,రాజకీయా ల నిర్వహణకి ముఖ్యమైన కేంద్రంగా ఉన్న త్రీ టౌన్ ప్రాంతం సమస్యల వలయంలో చిక్కుకొని విలవిలలాడుతుందని దుయ్యబ్టారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందటంఅంటే ఖమ్మం నగర కేంద్రం అభివృద్ధి చెందినట్లు అని తెలిపారు. ఎంతోమంది రాజకీయ నాయకులు ఖమ్మం నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రులైన ఖమ్మం త్రీ టౌన్ ని పూర్తి స్థాయిలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు.ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతం అంటే పేద ప్రజలు నివసించే ప్రాంతమని, అలాంటి ప్రాంతంలో పేదలు ఉంటారు కాబట్టి మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదని భ్రమల్లో నేటి పాలకులు ఉన్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్రీ టౌన్ ప్రాంతం అభివృద్ధికి నిధులు కేటాయించి నగర అభివృద్ధి కి పాటు పడాలని డిమాండ్ చేశారు. లేనియెడల తమ పార్టీ ఆద్వర్యంలో దశాల వారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం

సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు మాట్లాడుతూ ఖమ్మం త్రీ టౌన్ లో ఇప్పటివరకు మినీ స్టేడియం, ప్రభుత్వ హాస్పిటల్ లేవని విమర్శించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో త్రీ టౌన్ ప్రాంతం ఉన్నదని ఇలాంటి త్రీ టౌన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల పలు ప్రాంతాల్లో ని రోడ్లు కంకర తేలి భయంకరం గా తయారయ్యాయి అన్నారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ కంపు కొడుతోందని ఆరోపించారు.రోడ్లు , డ్రైన్లు అభివృద్ధి కావాలి అంటే త్రీ టౌన్ కి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం ) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ ,పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ నందిపాటి మనోహర్ ,మెరుగు సత్యనారాయణ, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ రావు ,డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాస్ రావు, పత్తిపాక నాగ సులోచన, బండారు యకయ్య, 35వ డివిజన్ కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు వీరబాబు, యర్రా రంజిత్ ఎస్కే ఇమామ్ ,శీలం వీరబాబు , ఎస్ కే సైదులు ,యర్రా మల్లికార్జున్, త్రీ టౌన్ కమిటీ సభ్యులు పోతురాజు జార్జి, ఎస్ కే బాబు గబ్బేటి పుల్లయ్య ,ఎర్ర నగేష్ సారంగి పాపారావు ,రంగు, హనుమంతచారి ,ఎస్కే. ఖాసీం,ఎస్కే .అమీనా, మీనాల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు..



# మల్లు భట్టి విక్రమార్క చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28,తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నేరడ గ్రామానికి చెందిన తవటపు సాయి 60 వేల రూపాయలు చెక్కు అందించడం జరిగింది . ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు షేక్ అఫ్జల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వనం చిన్నప్ప గ్రామ కాంగ్రెస్ నాయకులు షేక్ సుభాని మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ యుసుబ్ మియా బీసీ సెల్ అధ్యక్షులు పుల్లిపాటి ఎర్రబాబు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ యాకుబ్ పాషా బూత్ కన్వీనర్ షేక్ షర్ఫుద్దీన్ గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జి ముత్తయ్య షేక్ బాబా తవటపు బచ్చయ్య పులిపాటి రవి షేక్ మదర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ వన్ లో సత్తా చాటిన గోవిందాపురం (ఏ) గ్రామ వాసి

- రాష్ట్రంలో 92వ ర్యాంకుతో 'డీపీఓ' పోస్ట్ సాధించిన భాగం నిఖిల రామచంద్ర



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామ వాసి, భాగం రాము, గీతాదేవి ల కుమార్తె(భాగం నారాయణరావు నిర్మలా దేవి మనవరాలు) భాగం నిఖిల గ్రూప్ వన్ లో సత్తా చాటి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ ) పోస్ట్ సాధించింది. మొదటి మొదటి నుండి చదువుల్లో రారాణి గానే నిలిచింది. పదవ తరగతి వరకు డీఏవి పబ్లిక్ స్కూల్లో చదివి, విజయవాడ (గొల్లపూడి) నారాయణ జూనియర్ కాలేజీలో 98% మార్కులతో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసింది. నారాయణ ఐఏఎస్ అకాడమీలో 90% మార్కులతో కాలేజ్ టాపర్ గా డిగ్రీ పట్టా అందుకుంది. దూరవిద్య ద్వారా ఎంఏ సోషియాలజీ పూర్తి చేసిన నిఖిల యుజిసి నెట్ రాసి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించారు. తాజాగా వెలువడిన గ్రూప్ వన్ ఫలితాలలో స్టేట్ 92వ ర్యాంకు సాధించి డీపీఓ పోస్ట్ సాధించారు. ఆమె విజయం పట్ల గోవిందాపురం ఏ గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు, భాగం పాపారావు భాగం నిఖిల డిపిఓ పోస్ట్ సాధించటం గోవిందాపురం ఏ గ్రామానికి గర్వకారణం అని అన్నారు. గ్రామస్తులు, మండల అధికారులు అభినందనలు తెలిపారు




# సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** తిరుమలాయపాలెం మండలానికి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటగా సీఎంఆర్ఎఫ్ సహాయం అందింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. మొత్తం 80 మంది లబ్ధిదారులకు రూ.25.33 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... “కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ధ్యేయం అన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సీఎంఆర్ఎఫ్ ప్రజలకు రక్షణ కవచంలా నిలుస్తోందని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి చొరవతో గత ప్రభుత్వం కంటే త్వరగా లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, అరవింద్ రెడ్డి, ఉన్నం రాజశేఖర్, మండల పార్టీ ఇన్‌చార్జ్ గుర్రాల శ్రీనివాసరెడ్డి, జడల నగేష్ గౌడ్, పోట్ల కిరణ్, అంబేద్కర్, తాటికొండ కిరణ్, దుదిమెట్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# పుట్ట వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణం 6వ వార్డుకు చెందిన పుట్ట ఆంజనేయులు భార్య పుట్ట వరలక్ష్మి మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా వరలక్ష్మి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, “ప్రియమైన వ్యక్తిని కోల్పోవడం ఎంతటి బాధో వర్ణించలేనిది. కానీ ధైర్యంగా నిలబడాలి. వరలక్ష్మి లేని లోటు ఎప్పటికీ తీరనిది కానీ, కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను” అని అన్నారు.

డాక్టర్ చిన్నారెడ్డి వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగి వేణు, కోళ్ల వెంకటేష్, నందిమల్ల రాము, గౌనికాడి తిరుపతయ్య, జక్కుల నాగరాజు మేస్త్రి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



## ఖమ్మం బీసీఓ కార్యాలయంలో డీసీఓను కలిసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సార్లు వాటిని పొడిగిస్తూ జీవోలు జారీ చేసింది. ఆ జీవోల ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని సొసైటీల పదవీకాలాన్ని పొడిగించాల్సి ఉండగా, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని కొంతమంది కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు అక్కడి సొసైటీలను మాత్రం పొడిగించలేదని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గాలలో సొసైటీల పాలకవర్గాలను ఎలా పొడిగించారో, అదేవిధంగా పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలలో కూడా పొడిగించాలని బిఆర్ఎస్ చైర్మన్‌లు హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో శనివారం నాడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఖమ్మం బీసీఓ కార్యాలయంలో డీసీఓను కలిసి హైకోర్టు స్టే కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లం వేణు, రెడ్డెం వీర మోహన్ రెడ్డి, బోగోలు లక్ష్మణరావు, నర్మనేని అంజయ్య, అప్పారావు, బడేటి శ్రీనివాస్ రావు, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి తండ్రుల కష్టం నెరవేరిన వేళ

**ఆనంద బస్పాలలో కుటుంబం**

**కీసర, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు)**



మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీలో కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి దంపతుల ఇంట గర్వకారణమైన ఘనత చోటు చేసుకుంది. వీరి చిన్న కుమారుడు ప్రణయ్ కుమార్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) పరీక్షల్లో అద్భుతమైన ర్యాంక్ సాధించి, ఐఏఎస్‌గా ఎంపికయ్యాడు.ఇదే కుటుంబంలోని పెద్ద కుమారుడు ఉదయ్ కుమార్ ఇటీవలే విడుదలైన గ్రూప్1 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి, గ్రేడ్II మున్సిపల్ కమిషనర్ హోదాను సంపాదించాడు. రెండవ కుమారుడు పృథ్వీ కుమార్ న్యాయరంగంలో భవిష్యత్ నిర్మించుకుంటూ, హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బి చదువుతున్నారు.ముగ్గురు సోదరులు తమ తమ రంగాల్లో కృషి చేసి సాధించిన ఈ విజయాలు, కుటుంబాన్ని గర్వకారణంగా మార్చడంతో పాటు, సమాజంలో అనేక కుటుంబాలకు ప్రేరణగా నిలిచాయి. పిల్లలని మంచి విద్యతో తీర్చిదిద్దిన కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి దంపతులు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారని ప్రాంతీయులు అభిప్రాయపడ్డారు.



## రాజాకృష్ణదేవరావును మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):** దేవి శరన్న రాత్రులను వనపర్తి సంస్థాన వారసులు రాజాకృష్ణదేవరావు అత్యంత భక్తిశ్రద్ధతో, ఉపవాస దీక్షలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రులు పూర్తయ్యే వరకు ఆయన తన నివాసంలో ప్రత్యేక పూజలను ఆచరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

శనివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి రాజా కృష్ణదేవరావు నివాసానికి చేరుకుని మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, రాష్ట్ర విజయాలపై చర్చ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సాహసపూర్వకంగా చేపట్టిన కుల గణన, ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల వంటి మార్పులు శుభకరమైన పరిణామమని గుర్తించారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాకిటి బాలరాజ్, డి. పాండు రావు, అబ్దుల్లా, నందిమల్ల రాము, భాస్కర్ భాస్కర్, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## 75 ఏళ్లుగా వెల్టూర్ సర్పంచ్ ఎస్సీ రిజర్వేషన్ నోచుకోలేదు

- **ప్రజా ప్రభుత్వంలోనూ దళితులకు తీవ్ర అన్యాయం**
- **కాంగ్రెస్ నేత డీ.ఎస్. మహేష్ ఆవేదన**

**పెద్దమందడి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామం సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ 75 ఏళ్లుగా కల్పించలేదని కాంగ్రెస్ నాయకులు డీ.ఎస్. మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, "స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రకటించడంతో దళితులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. కానీ మరోసారి నిరాశే మిగిలింది. 75 ఏళ్లుగా దళితులకు న్యాయం జరగకపోవడం ప్రజాస్వామ్యానికి, సామాజిక సమానత్వానికి ముప్పు" అని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడినా దళితుల హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టకపోవడం తీవ్ర అన్యాయం అని మహేష్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే పునరాలోచన చేయాలని, అవసరమైతే హైకోర్టు దాకా వెళ్లి దళితుల హక్కుల కోసం పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.





## కీసర శ్రద్ధ జూనియర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

**కీసర, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర మండలం తెలంగాణ సాంప్రదాయ పండుగ బతుకమ్మను పురస్కరించుకొని కీసర శ్రద్ధ జూనియర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపక బృందం, కళాశాల నిర్వహణ సమన్వయంతో ఈ కార్యక్రమం ఆనందోత్సాహాలతో సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర మాజీ ఎంపీపీ సుజాత, కళాశాల ప్రిన్సిపల్ మదర్, వైస్ ప్రిన్సిపల్ నరసింహ హాజరై విద్యార్థినులను ప్రోత్సహించారు. సుజాత మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ పండుగలలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని, పూలతో చేసే ఈ పండుగ స్త్రీ శక్తి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు ఇలాంటి పండుగలను తరతరాలకు పరిచయం చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ మదర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ కేవలం ఒక సాంప్రదాయం మాత్రమే కాక, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప ఉత్సవమని అన్నారు. కళాశాలలో ప్రతీ విద్యార్థి ఇలాంటి సాంప్రదాయ ఉత్సవాలలో పాల్గొని సంస్కృతిని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఎత్తిపట్టుకొని పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ కళాశాల ఆవరణను సందడితో మార్మోగించారు. బతుకమ్మ చుట్టూ కూయిలి, తాళాలు మోగించి విద్యార్థినులు పాటలు పాడటం, ఆటపాటలతో సందడి చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం రంగురంగుల పూలతో, విద్యార్థుల ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణంగా మారిపోయింది.





## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు – బతుకమ్మ పాటలతో మార్మోగిన ప్రాంగణం.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలం, బి గంగారం గ్రామంలో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. బిటెక్, డిప్లొమా, యంబిఎ విద్యార్థినులు, విద్యార్థులు, మహిళా సాధికారత సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో..." వంటి పాటలతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. విద్యార్థినులు తెలంగాణ సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని బతుకమ్మలకు నైవేద్యం సమర్పించారు. రంగురంగుల పూలతో కళాశాల ఆవరణ అలంకరించబడింది.

ప్రిన్సిపాల్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ, "తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా విద్యార్థులు, మహిళా ఉద్యోగినులు బతుకమ్మ పండుగను జరుపుకోవడం మంచి సంప్రదాయం" అని అభిప్రాయపడ్డారు.

సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకత. ప్రకృతి, ఆత్మీయతలు, జీవనశైలిని ప్రతిబింబించే బతుకమ్మ పాటలు సాంస్కృతిక అస్తిత్వానికి నిదర్శనం. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ సంప్రదాయాలకు ప్రతీక" అని వివరించారు.

కార్యక్రమంలో మహిళా సాధికారత సంస్థ చైర్‌పర్సన్ రాచమళ్ళ శ్రీదేవి, కన్వీనర్ లీలావతి, ట్రస్టీ కిరణ్‌రంజిని, సభ్యులు రాజకళ, సుధారాణి, ప్రతిమ, రాణి, సత్యవేణి, నాగలక్ష్మి పాల్గొన్నారు. బతుకమ్మ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. వేడుకలో విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





## దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ పరిధిలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం పలు మండపాలను సందర్శించారు. కళ్యాణ్ పూరి, ఇందిరానగర్ కాలనీలతో పాటు చిల్కానగర్ ట్రాలీ ఆటో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపాలను దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆమె భక్తులందరితో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందుతూ, అనంతరం అన్నదాన కార్యక్రమంలో అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి కోకొండ జగన్, రామాంజనేయులు, బంటి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ ఘనంగా

**కీసర, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ జిల్లా కీసర మండల కేంద్రంలో శ్రీ బంగారు మైసమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ శనివారం ఉదయం 10 గంటలకు జరిగింది. స్వస్తి శ్రీ చంద్రనామా, శ్రీ విశ్వవాసు నామ సంవత్సర ఆత్మీయూజ శుద్ధ పంచమి సందర్భంగా ఊరు పెద్ద మనుషులు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తుడుం యాదగిరి, ప్రధాన కార్యదర్శి కుంటోల్ల సత్యనారాయణ మాట్లాడుతూ "దాతల సహాయంతో ఆలయాన్ని పునర్నిర్మించబోతున్నాం. ప్రతి ఒక్కరు అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కీసర మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా, శ్రీ సీతారామచంద్ర ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, జలాల్పురం సత్తిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, రామారాం సుజాత, రాగుల రమేష్ ముదిరాజ్, పుంద్రు విష్ణు, తుడుం ఆగమయ్య, కుంటోల్ల దశరథ్, చినింగని నరసింహ, కర్రె గణేష్, చినింగని భూపాల్, మొరుగు యాదగిరి, మొరుగు దశరథ్, తుడుం రమేష్, నర్సింగ్ రావు, శ్రీహరి, భరత్, సాయికుమార్, బాలకృష్ణ, శివకుమార్, తుడుం ప్రసాద్, అర్జున్, సాయి, తుడుం బాలరాజ్, లక్ష్మణ్, వెంకటేష్, కృష్ణ, వెంకటరెడ్డి, గణేష్ చారి, ప్రవీణ్, మహేష్, రాంబాబు, పోచయ్య, యాదగిరి, ఎల్లయ్య, మధుబాబు, రాజలింగం, తరుణ్, విజయ్ చందర్, అలాగే కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# రాచకొండ పోలీస్ మహిళల కోసం ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మహిళా పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరితంగా, సాంప్రదాయ సంగీతం, నృత్యం మరియు పూలతో అలంకరణలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో జరిగింది. సిబ్బందికి సిపి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, ఎస్ఓటి డీసీపీ రమణారెడ్డి, అడ్మిన్ డీసీపీ ఇందిరా, డీసీపీ విమెన్ సేఫ్టీ ఉషారాణి, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, ట్రాఫిక్ డీసీపీలు మనోహర్, శ్రీనివాసులు, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్యాంసుందర్ తదితరులు హాజరై కార్యక్రమానికి అధికారిక ఘనతను చేకూర్చారు.

విభిన్న ఇన్స్పెక్టర్‌లు, సిబ్బంది బతుకమ్మ పండుగ సందర్భంలో ఆడుతూ, పూలతో అలంకరించిన బతుకమ్మను చుట్టూ ఉంచి సాంప్రదాయ పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఇది మహిళా సిబ్బందిలో ఆనందాన్ని, ఐక్యతను పెంపొందించడానికి ఒక మంచి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమం పోలీస్ కమిషనరేట్ మహిళా సిబ్బందిని ప్రోత్సహించే, వారి కృషిని గుర్తించే ప్రయత్నంగా ఉండటంతో ప్రత్యేకంగా విశేషం. పండుగ సంబరాలలో పాల్గొన్న ప్రతి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు మరియు భవిష్యత్తులో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించే సంకల్పం వ్యక్తం చేశారు.




# నాగారం మున్సిపాలిటీ ఈస్ట్ గాంధీ నగర్‌లో బతుకమ్మ సంబురాలు

**నాగారం, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీ నగర్, రోడ్ నెం.5 వద్ద బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగినది . ఈ కార్యక్రమంలో సాంప్రదాయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ మహిళలు పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు.

ఈ వేడుకల్లో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి. శ్రావణ్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రదీప్, ఎ. బాబు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆనందాన్ని పెంపొందిస్తాయని కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాలనీ వాసులు, ముఖ్యంగా మహిళలు, ఈ సంబురాలను విజయవంతం చేయడంలో చూపిన చురుకుదనాన్ని ఆయన అభినందించారు.




# 119 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

◆ **సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల లబ్ధిదారులకు లబ్యం.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి పట్టణంలో శనివారం ఎమ్మెల్యే శిబిర కార్యాలయంలో సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన మొత్తం 119 మంది లబ్ధిదారులకు రూ.36,32,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అందజేశారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన 19 మంది లబ్ధిదారులకు రూ.5,16,500, సత్తుపల్లి మండలానికి చెందిన 28 మందికి రూ.9,28,500, వేంసూరు మండలానికి చెందిన 23 మందికి రూ.6,61,500, పెనుబల్లి మండలానికి చెందిన 49 మందికి రూ.15,26,000 విలువైన చెక్కులు పంపిణీ చేయబడ్డాయి.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పురపాలక మాజీ ఉపాధ్యక్షురాలు తోట సుజలారాణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, చంద్రశేఖర్ రెడ్డి, పంది వెంకటేశ్వరరావు, పురపాలక మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల రాచకొండ సీపీ సుధీర్ బాబు

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో శనివారం ఘన కార్యక్రమం జరిగింది. పోలీస్ కమిషనరేట్ నేరడ్మేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ సుధీర్ బాబు, ఐపిఎస్ నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాచకొండ సిబ్బంది, పోలీసులు, స్థానిక సివిల్ ప్రతినిధులు పాల్గొని, బాపూజీ దేశభక్తి, సమరపరిణామాలు మరియు స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రపై గుర్తింపు తెలియజేశారు. సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ, "కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య సమరంలో చూపిన త్యాగం, ధైర్యం, మరియు ప్రజల కోసం అతనికి ఉన్న అపార ప్రేమ ప్రతి తరం ఆచరణలో తీసుకోవలసినది" అని అన్నారు.కార్యక్రమం తర్వాత సిబ్బంది మరియు ప్రజలు బాపూజీ గురించి వివరాలు తెలుసుకొని, ఆయనతో సంబంధించిన చరిత్ర మరియు ఘనతలను మరింతగా గుర్తు చేసుకున్నారు.



## తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న షిప్

**హనుమకొండ సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

గీసుకొండ మండలంలోని వంచనగిరి గ్రామంలో గలమోడల్ పాఠశాల,జూనియర్ కళాశాల విద్యార్థులకు వృత్తి విద్య పై 10 రోజులపాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భయ్యా సునీత తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ దసరా సెలవులను పురస్కరించుకొని వృత్తివిద్య పట్ల అవగాహన కొరకు బ్యూటీ పార్లర్ లో ఇంటర్ షిప్ నిర్వహించినట్లు తెలిపారు. చదువుతోపాటు సెలవు దినాలలో ప్రత్యేక శిక్షణ తీసుకోవడం ద్వారా విద్యార్థులలో వృత్తి విద్యపై నైపుణ్యం మరింత పెంపొందించే అవకాశం ఉంటుందని,ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యం వెలుగులోకి వస్తుందని అన్నారు.ఇందులో భాగంగానే విద్యార్థులకు పది రోజులపాటు ఈ కోర్సులో మెలకువలు అందించినట్లు తెలిపారు.ఈ శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ మాదాసి శ్రీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

◆ **జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్**

**గౌతమ్ నగర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజ్గిరి నియోజకవర్గం గౌతమ్ నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె వినతిపత్రం అందజేశారు.కార్పొరేటర్ సునీత రామ్ యాదవ్ మాట్లాడుతూ "డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మౌలిక వసతుల పనులు చాలా కాలంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీ లైన్ల విస్తరణ, వీధి లైటింగ్, మంచినీటి సరఫరా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి పనులు పూర్తిచేయాలని కోరుతున్నాం" అని అన్నారు.అలాగే డివిజన్ అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించినట్లు, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ నాయకులు మేకల రామ్ యాదవ్ తో పాటు పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# హరిహరాంజనేయ స్వామి దేవస్థానంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**నాగారం, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్ జిల్లా, కీసర మండలంలోని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని హరిహరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉత్సవాల్లో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలరించారు. ప్రధాన కార్యక్రమంగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముప్పు సత్తిరెడ్డి, ఈసీఐఎల్ రిటైర్డ్, ముప్పు అశోక్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ, ముప్పు రాంరెడ్డి, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఇతర సామాజిక, రాజకీయ ప్రముఖులు భక్తులకు ఆశీర్వాదాలు ప్రకటించి ఉత్సవం యొక్క సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను గుర్తు చేశారు.స్థానికులు దేవస్థానం పరిరక్షణ, అభివృద్ధి కోసం తమ భక్తి, సహకారాన్ని వ్యక్తం చేశారు. ఉత్సవాలు ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని, సమాజం లో ఐక్యతను నిలుపుకునే విధంగా ఘనంగా ముగిసాయి.

# భగత్ సింగ్ బ్రదర్స్ యూత్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం రక్తదాన శిబిరం

**నాగారం, సెప్టెంబర్ 27(తెలంగాణ ముచ్చట్లు)**

నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో భగత్ సింగ్ బ్రదర్స్ యూత్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా, అలాగే షహీద్ భగత్ సింగ్ జయంతి పురస్కరించుకొని శనివారం భగత్ సింగ్ విగ్రహం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గాంధీ హాస్పిటల్ వైద్య సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించే పవిత్రమైన సేవ చేయగలమని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కీసర ఎస్సై హరిప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు, భగత్ సింగ్ బ్రదర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్ట మహేష్, ఉపాధ్యక్షుడు చీర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చీర మహేష్, పొట్ట భాస్కర్, చిందం వెంకటేష్, రేగు మహేష్, ఇతర సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.యువత ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను అందరూ ప్రశంసించారు.




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# హైటెక్ సిటీ టిచిప్ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

◆ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ద్వారా ఉపాధి, సామాజిక సంక్షేమం సాధించాలన్న సందేశం

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** హైటెక్ సిటీ ట్రేడింట్ హోటల్ లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ టిచిప్ కార్యక్రమంలో పాల్గొని ఆధునిక టెక్నాలజీ, పరిశోధన, ఇన్నోవేషన్ ప్రభావంపై ప్రసంగించారు.ఎంపీ ఈటల రాజేందర్ ప్రసంగంలో పాతకాల సౌకర్యాలు, ఆధునిక టెక్నాలజీ మార్పుల మధ్య తేడాలపై చర్చించారు. "ఒకప్పుడు ఫోన్ చేయాలంటే రెండుమూడు గంటలు వేచి ఉండాల్సి ఉండేది, కానీ ఇప్పుడు టీవీ, సెల్ ఫోన్ వంటి వైఫైలు పూర్తిగా ఎలక్ట్రానిక్ మయంగా మారాయి," అని చెప్పారు. అంతేకాక, ప్రతిభావంతులైన భారతీయులు తమకు తగిన ఆదరణ, అవకాశాలు లభించకపోతే విదేశాలకు వెళ్తున్నారని, దేశంలోనే ఈ అవకాశాలను సృష్టించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. "అమెరికా కూడా స్థానికులకే ప్రాధాన్యత ఇస్తోంది. మన దేశంలోని టెక్నాలజీ, పరిశోధన, ఇన్నోవేషన్ ద్వారా ఉపాధి కల్పించడం ముఖ్య," అని సూచించారు.ఇక తెలంగాణను ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దడం, శాస్త్ర విజ్ఞానం ఫలితాలను పేదరికం, వైద్య సమస్యలు, ఉపాధి లేమి వంటి సమస్యలకు ఉపయోగించే దిశలో అభివృద్ధి చేయాలని ఎంపీ అన్నారు. ఆయన అబ్దుల్ కలాం స్ఫూర్తిదాయక ఉదాహరణలు కూడా సమ్మతించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సందీప్ మక్తాల, వంశీ, బాల, భాగ్య, నవనీత్ పాల్గొన్నారు.





# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

◆ పోలీస్ కమిషనర్ సునీల్ దత్.

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. జిల్లాలోకురుస్తున్నవర్షాలకువరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నీట మునిగిన రోడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని, యువకులు రీల్, సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఇవాళ కూడా ఇదే పరిస్థితులు వుండే అవకాశం ఉందని వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, పోలీస్ కంట్రోల్ సెల్ నెంబర్ 8712659111, కలెక్టర్ ఆఫీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1077, సెల్ నెంబరు 9063211298 సమాచారం అందిచాలని సూచించారు. ఇప్పటికే చెరువులు, వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని పోలీస్ అధికారులకు సూచించామని తెలిపారు. కామేపల్లి మండలం. పొన్నెకల్ వద్ద బుగ్గవాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో పొన్నెకల్ కొత్తలింగాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, రఘునాథ పాలెం మండలం. రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకి పాపటపల్లి నుండి విఆర్ బంజర మధ్యలో ఉన్న బుగ్గవాగులో బ్రిడ్జి పై నుండి మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది, రాకపోకలు నిలిపి వేశారని, అదేవిదంగా కారేపల్లి మండలం కమలాపురం నుండి కొత్తలింగాల వెళ్లే రోడ్ పై నుండి బుగ్గవాగు మూడు అడుగుల అదేవిదంగా తోడితలగూడెం నుండి చీమలపాడు వెళ్లే మార్గంలోని వంతెన పై నుండి రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది ఈ నేపథ్యంలో తాత్కాలికంగా వాహనాల రాకపోకలు నిలిపివేశారని తెలిపారు.




## మల్కాజ్గిరి రైల్వే సమస్యలకు పరిష్కారం

# 15 ఆర్‌యూబి/ఆర్‌ఓబి నిర్మాణాలకు మంజూరు


◆ 15 నెలలలో సుస్థిర అభివృద్ధి చర్యలు; కేంద్ర, రాష్ట్ర రైల్వే, జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీసు అధికారులతో సమన్వయంతో అమలు

◆ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి రైల్వే సమస్యలకు పరిష్కారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, తన గెలుపు తర్వాత రైల్వే, ట్రాఫిక్, భూసేకరణ సమస్యల పరిష్కారానికి పలు చురుకైన చర్యలు తీసుకున్నారని తెలిపారు.రాజేందర్ తెలిపారు: "మల్కాజ్గిరిలో రైల్వే సంబంధ సమస్యలు ఎక్కువ. ముఖ్యంగా ఫతే నగర్, బొల్లారం, అల్వాల్, లయోలా కాలేజ్ రూట్ ల వద్ద ట్రాఫిక్ జామ్‌లు సమస్యగా మారాయి. గేట్ల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది."వీటిని పరిష్కరించడానికి రాజేందర్ కేంద్ర, రాష్ట్ర రైల్వే అధికారుల తో కలిసి ఫీల్డ్ విజిట్లు నిర్వహించి, జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీస్ శాఖలతో సమన్వయ సమావేశాలు పెట్టారు. ఆయన తెలిపినట్లుగా, ఆర్ఆర్‌బి నిర్మాణానికి కేంద్రం-రాష్ట్రం 100% నిధులు మంజూరు చేయాలని కోరగా, కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు.ఫలితంగా, మల్కాజ్గిరిలో 15 ఆర్‌యూబి/ఆర్‌ఓబి నిర్మాణాలకు మంజూరు దొరికింది. ముఖ్య ప్రాజెక్టులు: మచ్చ బొల్లారం ఆర్ఆర్‌బి - 6 నెలల్లో పూర్తి మౌలాలి - 200 కోట్లతో 4 లైన్ ఆర్ఓబి,అయోధ్య. ఎక్స్ రోడ్ - 200కోట్లతో 4 లైన్ ఆర్ఓబి, లయోలా కాలేజ్, వెంకటాపురం రూట్ , ఆర్‌యూబి మంజూరు.ఓల్డ్ అల్వాల్, షఫీల్ గూడ్, కాకతీయ కాలనీ, వాజపేయి నగర్, అమ్ముగూడ ఆర్‌యూబి మంజూరు. అనంద్ బాగ్ - రైల్వే స్టేషన్ నిర్మాణం కోసం అంగీకారం రాజేందర్ పేర్కొన్నారు, భూసేకరణ కోసం రైల్వే డిపార్ట్మెంట్ నుండి మేడ్చల్, గౌడవల్లి, గుండ్లపోచంపల్లి భూసేకరణకు నిధులు కేటాయించామని.అతను మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ, పిసిసి ప్రెసిడెంట్ ఆరోపణల గురించి:నా గెలుపుకు సాక్ష్యం మీరే. ఆరోపణల్లో పస ఉంటే మాట్లాడతా, కానీ పనులు చేస్తున్నాం, చెప్పలేక పోతున్నాం. నాయకుడు అనుకుంటే మాత్రమే మాట్లాడతాను. ప్రజలు నిజాన్ని తెలుసుకుంటారు.రాజేందర్ తెలిపిన విధంగా, వందేభారత్, రైలు లైన్ల డబ్లింగ్, స్టేషన్ల ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వేగవంతంగా జరుగుతున్నాయి.రాజేందర్ అధికారికంగా చెప్పారు, "12 పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర రైల్వే శాఖ మంత్రితో నిర్వహించనున్నాం. చర్చలకంటే పనులు ముఖ్యమని నేను నమ్ముతున్నాను.

# ఎల్‌బి నగర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఈటల

◆ 1941 నుండి తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న బాపూజీ జీవిత సంఘర్షణ, సేవలు భావి తరాలకు స్ఫూర్తిగా




**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమానికి నిరంతర కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఈటల రాజేందర్, మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి ఎల్. రమణ తో కలిసి ఎల్ బి నగర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, బాపూజీ తన జీవితాంతం తెలంగాణ సాధికారత కోసం పోరాడినప్పటికీ ఎప్పుడూ వ్యక్తిగత పదవులను పెద్దగా ప్రాధాన్యం ఇవ్వనన్న విషయం తెలిసిందే. 1941లో గాంధీజీని కలిసిన తరువాత క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా, 1947 48లో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటంలో పాల్గొని, ఆ సమయాలలో యువకులు ప్రాణాలు కోల్పోయినప్పటికీ ఆయన ఆరాటం ఆగలేదని వివరించారు. ఈటల చెప్పారు, "నేను చిన్నపిల్లగాడిగా ఉన్నప్పుడు బాపూజీ మా ఊరికి వచ్చి ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారు. చేనేత శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. మలి దశ ఉద్యమంలో సొంత ఇంటిని కూడా ఉద్యమానికి సమర్పించారు. 97 ఏళ్ల వయసులో కూడా మైనస్ డిగ్రీల చల్లులో ఢిల్లీలో దీక్షకు హాజరయ్యారు."విగ్రహాన్ని శిల్పి ఈశ్వర చారి సృష్టించారు. ఈ కార్యక్రమంలో తడక యాదగిరి రాసిన "కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర" పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఎంపీ ఈటల రాజేందర్, బాపూజీ ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించే విధంగా విగ్రహ ఆవిష్కరణ జరిగినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈటల రాజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానికులు, ఉద్యమ సహచరులు, బాపూజీ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేశారు.

# తెలంగాణ ఉద్యమకారురాలి అనారోగ్యాన్ని తెలుసుకున్న ఎంపీ ఈటల పరామర్శ



**మేడ్చల్ మల్కాజిగిరి, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు) :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొని డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఉద్యమకారురాలు నళిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ఆమెను పరామర్శించారు.బోయినపల్లిలోని పతంజలి వెల్‌నెస్ సెంటర్ లో చికిత్స పొందుతున్న నళినిని కలసి, ఆమె ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్తితులు, వైద్య పరిస్థితులను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, నళినితో ఎంపీ ఈటల రాజేందర్ పాత తెలంగాణ ఉద్యమ సమయాలను గుర్తు చేసుకోవడం, ఆ సమయంలో ఎదురైన కష్టాలను చర్చించడం జరిగింది.నళిని మాట్లాడుతూ, "ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం పోరాటం తీవ్రంగా సాగుతుండగా, మరోవైపు అధికారుల అణచివేత పెరిగింది. అందుకే 37 ఏళ్ల వయసులోనే డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో చేరాను" అన్నారు. 32 ఏళ్ల వయసులో ఉద్యోగానికి ఎంపికయ్యాను, కానీ 37 ఏళ్ల వయసులోనే 2009 లో బయటకు వచ్చానని వివరించారు.ప్రస్తుతం వారం రోజులుగా తీవ్రమైన జ్వరం, కాళ్ల వాపు, కూర్చుంటే లేవలేని పరిస్థితి ఆమెకు ఉందని చెప్పారు. ఆర్యసమాజ్ వారు అండగా ఉన్నారని, హాస్పిటల్‌లో మంచి వైద్యం అందిస్తున్నారన్నారు. నళిని తన అనుభవాలను ఇలా చెప్పారు:ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం రాకపోవడం కన్నా నా భావోద్వేగాలను పట్టించకపోవడం వల్లనే బాధ ఎక్కువ. 21 నెలలు అయినా ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 16 పేజీల లేఖను సీఎం రేవంత్ రెడ్డి చేతిలో ఉంచానని, వెంటనే పరిష్కరిస్తారు అనుకున్నా. అయితే, ఇలా చేస్తారు అనుకుంటే అసలు వినతిపత్రం ఇచ్చే దానినే కాదు.నా లాగా ఏ ఆఫీసర్‌కు ఇదో కష్టంగా ఉండరాదు. నన్ను సన్మానించకపోయినా అవమానం చేసే అధికారం వారికి లేదు. ఇది ముమ్మాటికీ నన్ను అవమానించడం మాత్రమే" అని వాపోయారు. నళిని తండ్రి 60 ఏళ్ల నుండి ఆర్ఎస్ఎస్ లో పని చేస్తున్నారని, ఇప్పుడు పెద్దలుగా ఉన్న ఆర్ఎస్ఎస్ లీడర్లందరికీ ఆశ్రయం అందిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. నళిని నాలుగేళ్లుగా ఆర్యసమాజ్ తో కలిసి పనిచేస్తున్నారని, వేల మందితో యజ్ఞాలు నిర్వహించారని, వేదంయజ్ఞం ఆధారంగా సనాతన ధర్మంపై పుస్తకం రాసినట్లు చెప్పారు. ఇంకా నాలుగు పుస్తకాలు రాయాలని భావిస్తున్నారన్నారు, కానీ ఆరోగ్యం సహకరించడం లేదని పేర్కొన్నారు.ఈటల రాజేందర్ నళినికి భరోసా ఇచ్చారు:ఇక్కడ ఉన్నంత కాలం కావాల్సిన వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తాం. మీకు ఏ ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత నాది. కొంత నయం అయ్యిన తర్వాత, నళిని కోరిన చికిత్స కోసం హరిద్వార్‌కు పంపించే ఏర్పాట్లను కూడా చేస్తాం అని చెప్పారు.

## ఖమ్మం కమిషనరేట్లో పట్టుబడిన

# 200 కిలోల గంజాయి దహనం



**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;** వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేతృత్వంలో శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన 200 కిలోల ఎండు గంజాయిని అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ పర్యవేక్షణలో తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ లిమిటెడ్‌లో నిర్వీర్యం చేశారు. ఖమ్మం వన్ టౌన్, ఖమ్మం టూ టౌన్,ఖమ్మం త్రీ టౌన్ , ఖమ్మం రూరల్, కూసుమంచి, వి.యం.బంజారా, కారేపల్లి, పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 18 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన నేరస్థులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు అడిషనల్ డిసిపి తెలిపారు. జిల్లా పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి సరకును కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామన్నారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, సిసిఆర్బి సిఐ స్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తుడును అరెస్టు చేసిన

# ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం బ్యూరో చీఫ్ , సెప్టెంబర్ 27, తెలంగాణ ముచ్చట్లు,;** ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 11 లక్షలు రూపాయలు మోసం చేసిన కేసులో ఒక్కరినీ ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు రంగారెడ్డి జిల్లా మణికొండ లో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలానికి చెందిన సివిల్ ఇంజనీర్ కి ఫోన్ చేసి ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ మరియు ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 11 లక్షలు రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను "2" లక్షల రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్ అయిన లక్కీ రెడ్డి హరి ప్రసాద్ రెడ్డి ని , 44 సం. ని గుర్తించి రంగారెడ్డి జిల్లా మణికొండ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి. ఎస్పీ, సి హెచ్ ఆర్ వి ఫణిందర్ ని మరియు అట్టి టాస్క్ లో పాల్గొన్న ఎస్సైలు రంజిత్ కుమార్ మరియు విజయకుమార్ లను, కానిస్టేబుల్స్ కృష్ణా రావు మరియు కిషన్ రావు లను మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సిపి సునీల్ దత్ ఐపీఎస్ అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

◆ **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా రాజపేట సమీపంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, వనపర్తి నియోజక వర్గ శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు.

డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, “రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేశారు. వనపర్తి మొదటి విడతలోనే ఈ సెంటర్ పొందింది. డిసెంబర్ 3, 2014 నుండి విద్యార్థులకు నాణ్యతమయిన విద్య అందించడం మా లక్ష్యం” అని తెలిపారు.

వనపర్తిలో ఐటిఐ మరియు పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేసి, విద్యార్థులకు మంచి చదువు అందించడానికి ప్రయత్నించాము. ఈ సెంటర్ ప్రభుత్వ సహకారంతో ప్రారంభించబడింది. విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత ప్రభుత్వ అనుమతినిచ్చిన సంస్థల్లో ఉద్యోగాలను పొందగలుగుతారు. చదువుకు వెచ్చించిన సమయం వృథా కాకుండా ఉపయోగకరంగా మారుతుంది”.సెంటర్ నిర్మాణానికి ఆరు కోట్ల రూపాయల వ్యయం చేయబడింది. విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాత వనపర్తి అభివృద్ధికి దోహదం చేస్తారని డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించిన ఇంజనీర్ అనిల్ను అభినందిస్తూ, శాలువ కప్పి సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాష్ట్ర మైనార్టీ నేతలు కమర్ మియా, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, మండల అధ్యక్షులు నారాయణ, పెంటన్న యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు దేశ చరిత్రలోనే తలమానికం

◆ **సాహసోపేత నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

◆ **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**



దేశ చరిత్రలోనే తొలిసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఘనత కాంగ్రెస్ పార్టీదే అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, “రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో బీసీల సమస్యలను గుర్తించారు. సోనియా గాంధీ ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ ప్రకారం 42% రిజర్వేషన్ అమలు చేయబడింది. ఇది కేవలం కాంగ్రెస్‌కే సాధ్యం” అన్నారు.

అయన విమర్శిస్తూ, “బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేసి రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. కేంద్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా బీసీల పక్షాన నిలబడడం లేదు. ఇది ద్రోహం” అని మండిపడ్డారు.

బీసీల రిజర్వేషన్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తమిళనాడు తప్ప దేశంలో ఎక్కడా ఇంత పెద్ద రిజర్వేషన్ ఇవ్వలేదని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా, ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేశారని అభినందించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. బీసీ సంఘాలన్నీ ఐక్యంగా ఉండి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యుగేందర్ గౌడ్, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాచారం పోలీస్ స్టేషన్‌లో కొత్త సిఐ ధనుంజయ బాధ్యతలు స్వీకరణ

**నాచారం, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం పోలీస్ స్టేషన్ నూతన సిఐగా ఇన్స్పెక్టర్ ధనుంజయ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాచారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చి ఆయనను ఘనంగా సత్కరించారు. పూల గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సిఐ బాధ్యతలు స్వీకరించడంతో స్థానిక ప్రజల్లో ఆనందం నెలకొంది. ధనుంజయ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, చట్టం మరియు శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని సిఐ ధనుంజయ ఈ సందర్భంగా వెల్లడించారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, విట్టల్ యాదవ్, దాసరి కర్ణ, రామచందర్, భూపాల్ రెడ్డి, టేకి రాజశేఖర్, మక్బూల్, చంద్రశేఖర్, సుగుణాకర్, వాసు, రోహిత్, నరసింహ, యూసుఫ్, మల్లికార్జున్ గౌడ్, లడ్డు జయరాజ్, బాలరాజ్, ఈశ్వర్, కిట్టు, హరీష్, ఫైజ్, గ్యాస్ ఉద్దీన్, సంతోష్, కోటి, ముధసీర్, నాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులు మాట్లాడుతూ, నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సిఐ బాధ్యతలు చేపట్టడం ద్వారా ప్రజలకు మరింత సేవ అందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పార్టీ అవకాశమిస్తే పెద్దమందడి ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో ఉంటా

**-- సింగిరెడ్డి కురుమూర్తి పెద్దమందడి బిఆర్ఎస్ నాయకులు**

**పెద్దమందడి,సెప్టెంబర్27(తెలంగాణ ముచ్చట్లు):**



స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పెద్దమందడి 1 స్థానాన్ని ఎంపీటీసీగా జనరల్ కేటగిరికి కేటాయించడంపై బిఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి కురుమూర్తి తన ఆసక్తిని వ్యక్తం చేశారు.

శనివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..దళిత సామాజిక వర్గానికి చెందిన కురుమూర్తి బిఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు ఆసక్తి ఉన్నట్లు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, “పార్టీ నాకు అవకాశం కల్పిస్తే, దళిత సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వడం ద్వారా ప్రజల సేవలో ముందుగా ఉండగలను. నా లక్ష్యం ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడం” అని తెలిపారు.

కురుమూర్తి తన కుటుంబ, సామాజిక నేపథ్యాన్ని గుర్తుచెప్పుతూ, “దళిత వర్గానికి రాజకీయ వేదికపై ప్రతినిధిగా నిలబడటం ద్వారా సామాజిక సమానత్వం, అభివృద్ధికి తోడ్పడాలని సంకల్పించుకున్నాను” అని పేర్కొన్నారు.

పార్టీ నేతలకు సూచనలుగా, స్థానికంగా ఎన్నికల సమయంలో దళిత, ఇతర వర్గాల ప్రజలకు సానుకూలమైన అవకాశాలను ఇవ్వాలని కోరుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కురుమూర్తి తన అభ్యర్థిత్వంపై పార్టీ నిర్ణయం ప్రకటించే సమయాన్ని ఎదురు చూస్తున్నానీ, సాధ్యమైతే ఎంపీటీసీ బరిలో తమ పేరు ప్రకటిస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగిరెడ్డి కురుమూర్తి తెలిపారు.

# వర్షంలో హైదరా... బాధ...



భాగ్యనగరం
జనసంద్రం.
ఇప్పుడు
భాగ్యనగరం
జలసంద్రం.
మురికి వాడలన్నీ
మురిసిపోతున్నాయి
వర్షా ధారలతో....
అయ్యో పాపం
మురికి వాడలన్నీ
మునిగిపోతున్నాయి
పర్యావరణ.
పరిశుభ్రత.
వాన రాకడ
ప్రాణం పోకడ
అనే సామెత
నిజమవుతుంది.

నదులు.....
పొంగిపొర్లుతున్నాయి
ప్రాజెక్టులు....
నిండిపోతున్నాయి.
పంట పొలాలు
మునిగిపోతున్నాయి
రైతన్నల కన్నీళ్లు
కాలువలౌ వుతున్నాయి
అతివృష్టి అనావృష్టి
వరుణ దేవా..
ప్రకృతి..
జలప్రళయంగా మారింది

ప్రకృతిలో జంతువులకు
పశుపక్ష్యాదులకు...
వాన మరణ శాసనం.
ప్రకృతి వినాశనం.

జలవిలయాన్ని.....
ప్రకృతి ప్రళయాన్ని....
కాపాడు వరుణ దేవా !
మానవ ప్రాణ రక్షణ నీదే !!

" కావ్యసుధ "
"సాహితీ శిరోమణి"
" కవన సాగర "
హైదరాబాద్
9247313488



# భగత్ సింగ్ 118వ జయంతి చిత్రపటానికి పూలమాల

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కమలానగర్ ఆఫీసులో షహీద్ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఘనంగా సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.

ప్రముఖ విద్యావేత్త కర్రె మల్లేశం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "చిన్న వయసులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని అచంచల ధైర్యంతో ఉద్యమాన్ని నడిపి బ్రిటిష్ వారికి గడగడ వణికించిన విప్లవ వీరుడు భగత్ సింగ్" అని కొనియాడారు. సమాన సమాజ నిర్మాణం కోసం ఆయన ఎన్నో గ్రంథాలు అధ్యయనం చేసి, ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తు చేశారు. పార్లమెంటులో పొగ బాంబులు విసిరి పట్టుబడి జైలు, కోర్టులను కూడా పోరాట వేదికలుగా మార్చారని వివరించారు. ఉరితీయబడే క్షణంలో కూడా ధైర్యాన్ని ప్రదర్శించి బ్రిటిష్ పాలకులను దిగ్భ్రాంతికి గురిచేశారని తెలిపారు.

కోమటి రవి మాట్లాడుతూ, భగత్ సింగ్ భారత యువతకు ఐకాన్‌గా నిలిచారని అన్నారు. జైలులో ఎన్నో రచనలు చేసి, మతాన్ని రాజకీయాల్లోకి తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. సోషలిజం ఆధారంగా సమానత్వ సమాజాన్ని నిర్మించాలని ఆయన ఆకాంక్షించారని తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు, శ్రీమన్నారాయణ, గద్దల నరసింహారావు, ఏం. భాస్కరరావు, గుమ్మడి హరి ప్రసాద్ తదితరులు ప్రసంగించి భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

తరువాత సభ్యులంతా కలిసి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, గౌసియా, కోమటి రవి, వెంకటేశ్వరరావు, గద్దల నరసింహారావు, కృష్ణమాచార్యులు, ఏం. భాస్కరరావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.




# నిబద్ధత కలిగిన నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

**చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చిల్కానగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు సకినాల ప్రసాద్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ “ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రముఖ స్వతంత్ర సమరయోధులు. క్విట్ ఇండియా ఉద్యమం, గైర్ ముల్కీ ఆందోళన, తెలంగాణ ఉద్యమం మొదలైన పోరాటాల్లో ఆయన త్యాగం మరువలేనిది. తెలంగాణ తొలి తరానికి మార్గదర్శకుడైన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి” అని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉద్యమ నాయకులు సకినాల ప్రసాద్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, రామాంజనేయులు, అడ్వకేట్ పవన్, శ్యామ్, బంటి తదితరులు పాల్గొన్నారు.

# పుష్పానికి పట్టాభిషేకం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;**

అక్కడ పూసిన ప్రతి
పూవూ గౌరమ్మవుతుంది.
అక్కడ వేసిన ప్రతి
మొగ్గా బొడ్డెమ్మవుతుంది.
ప్రతి పూబంతి మోము ..తంగేడు పూవర్ణమవుతుంది..

ప్రతి ఇంతి చేస్పర్శా ..గూనుగుధూళి రాలుస్తుంది..

"పూద్రోణులచుట్టూ పూబోణుల చక్రభ్రమణం"

ప్రతి వాడా తండా గుడీ చావడీ.... ఒక అద్భుత దృశ్యం.
దేవుణ్ని పూజించే పూవునీ పూజించే సంస్కారం..
ఆశ్వీజమాస ప్రవేశాన ఈ గడ్డపై ఆవిష్కారం

'నిండు నూరేళ్ళూ బతుకమ్మా' అంటూ
పుత్తడిబొమ్మల్ని ముద్దాడే
వనదేవత దీవెన ‐‐‐బతుకమ్మ।

సుమసౌరభాలతో శరద్వెన్నెలలు సమ్మిళితమై శ్రమజీవిని సేదదీర్చే
వీవన ‐‐‐బతుకమ్మ॥

గడ్డి మోపుల్ని నీటిబిందెల్ని మట్టి తట్టల్నీ
ఎత్తె చేతులే
పూరాశుల్ని తలపై ఎత్తుకునే శ్రమైక సౌందర్య
సామూహ్యమే...... బతుకమ్మ।

మనిషి పరిధినీ ప్రకృతి అవధినీ కలిపే
సామీప్యమే.... బతుకమ్మ॥




**డా!! ఏ.వి.గిరిసింహారావు**
**వైద్యుడు.రచయిత**
**సామాజిక వేత్త-**
**సీనియర్ మెడికల్**
**ఆఫీసర్ తెలంగాణ ప్రజారవాణా సంస్థ**

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమాయకులను బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు

- ఈజీ మనీకి అలవాటు పడిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు
- ఏకంగా 120 మందిని మోసం చేశారు
- చివరకు ఓ టీచర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నిజామాబాద్ జిల్లా పోలీసులు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

సైబర్ మోసాల్లో కొత్త కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకవైపు పోలీసులు ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తున్నప్పటికీ రూటు మారుస్తూ.. అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు కేటుగాళ్లు. ఈజీ మనీకి అలవాటు పడిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మరో ఇద్దరితో కలిసి ముఠాగా ఏర్పడి కోట్లు కొల్లగొట్టారు. క్రిప్టో కరెన్సీ, ఫిక్సడ్ డిపాజిట్లు, ట్రేడిరగ్, రియల్ ఎస్టేట్ వంటి పేర్లతో పలువురి నుంచి రూ. 15 కోట్లు సేకరించారు. బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోగా.. కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపించారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 120 మందిని మోసం చేశారు. చివరకు ఓ టీచర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నిజామాబాద్ జిల్లా పోలీసులు నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. నిజామాబాద్ నగరానికి చెందిన మహ్మద్ మెయిస్ ఖాన్, సయ్యద్ అహ్మద్ హసన్ చిన్ననాటి నుంచి ఫ్రెండ్స్. కలిసి చదువుకున్న వీరిద్దరి సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో అక్రమాలకు తెర లేపారు. అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశ చూపించి పలువురి నుంచి ఫిక్సడ్ డిపాజిట్లు సేకరించారు. అలాగే శ్రీమ్ ఎవర్ గ్రీన్ కనస్ట్రక్షన్స్, మోవన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ పేరుతో కంపెనీలను సృష్టించి రియల్ ఎస్టేట్ రంగంలో, %ాతీశీట ఛ్‌తీవవస్త్రబప.షశీఎ,ూాషశ్‌ఝూతీ శీటఛ్‌.షశీఎ% పేరుతో ఆన్‌లైన్ సైట్స్ సృష్టించి పెట్టుబడులు సేకరించారు. కమీషన్ ఏజెంట్లను నియమించుకొని డిపాజిట్లు సేకరించడంతో పాటు మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో ముంబాయి, గుల్బర్గాలో రీజినల్ ఆఫీస్ లు ఓపెన్ చేశారు.

ఆలేరులో హైడ్రామూవ్ కంపెనీ పేరుతో ఆఫీసు ఓపెన్ చేశారు. సైబర్ నేరస్తుల కలిసి డాలర్ ట్రేడిరగ్ పేరుతో డబ్బులు వసూలు చేశారు. ఇలా 2022 నుంచి వందలాది మంది వద్ద రూ. 15 కోట్లు సేకరించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 125 మంది రూ. 8 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. పెట్టుబడులు పెట్టిన వారికి లాభాలు చూపుతూ డబ్బు మొత్తాన్ని తమ వద్దే ఉంచుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం లోలం గ్రామానికి చెందిన హకీం అనే టీచర్ వీరి వద్ద పెట్టుబడి పెట్టడంతో పాటు ఏజెంట్‌గా పనిచేసి మరికొందరితో ఇన్వెస్ట్ చేయించాడు. కానీ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పెట్టుబడి పెట్టిన వారంతా ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. దీంతో హకీం పది రోజుల కింద ఇందల్వాయి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య విచారణ బాధ్యతను సీసీఎస్ టీమ్‌కు అప్పగించారు. దీంతో విచారణ మొదలుపెట్టిన పోలీసు మహ్మద్ మెయిస్ ఖాన్, సయ్యద్ అహ్మద్ హసన్ను నిజామాబాద్ అరెస్ట్ చేశారు. నిందితులిద్దరీ బ్యాంక్ అకౌంట్స్, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి వెల్లడిరచారు. వీరికి వాజిద్ హుస్సేన్ అనే మరో వ్యక్తి సహకరించాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని, ఈ అక్రమంలో ఇంకా ఎంత మంది ఉన్నారో విచారిస్తామని చెప్పారు. ఈ ముఠా ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు అందులో ఉపాధ్యాయులను సెలక్ట్ చేసుకుని మోసాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

# ఓటు చోరీతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారు

- ఓటు చోరీతోనే ప్రధానమంత్రి మూడోసారి అధికారంలోకి వచ్చారు
- ఓటు చోరీపై మహేష్ గౌడ్ సంచలన ఆరోపణలు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఓటు చోరీతోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటు చోరీ జరిగిందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పుకొచ్చారు. ఓటు చోరీతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఓటు చోరీ విషయంలో ప్రతి గ్రామంలో వందకు పైగా సంతకాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఓటు చోరీ జరిగిందని నమ్ముతూ తాను సంతకం పెడుతున్నానని పేర్కొన్నారు మహేష్ కుమార్ గౌడ్. ప్రతి గ్రామంలో కనీసం వందకి తగ్గకుండా సంతకాలను టీపీసీసీ చేపడుతుందని తెలిపారు. ఓట్ చోరీకి బీజేపీ పాల్పడిరదని ఆరోపించారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఓటు చోరీతోనే తెలంగాణలో బీజేపీ 8 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచారని తాను పాదయాత్రలో చెప్పానని అన్నారు. ఓటు చోరీపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇప్పటివరకూ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీ ఈటల రాజేందర్ మూడు లక్షల ఓట్ల గెలుపు వెనుక ఓటు చోరీ ఉందని ఆరోపించారు. ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి విఘాతమని చెప్పుకొచ్చారు మహేష్ కుమార్ గౌడ్. ఓటు చోరీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలకు మోదీ ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పవర్ ఆఫ్ ఓటుకి దెబ్బ తగులుతోందని చెప్పుకొచ్చారు. దేశంలో 80 శాతం మంది ప్రజలు ఓటు చోరీ జరిగిందని నమ్ముతున్నారని తెలిపారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు చోరీ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. ఓటు చోరీని అరికట్టాలని కోరారు. ఓటు చోరీ సంతకాల సేకరణలో జర్నలిస్టులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బిహార్‌లో మూకుమ్మడిగా ఓట్లను తొలగించారని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# బతుకమ్మ ఉత్సవంతో ప్రకృతి ఆరాధన

- బుద్ధభవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- ముఖ్య అతిథిగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

బుద్ధభవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బుద్ధభవన్‌లో ఉన్న కార్యాలయన్నిటిలో ఉన్న మహిళా ఉద్యోగిణిలు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొని ఆడి పాడారు. తల్లితనం ఆరోగ్యం అనే అంశంపై ఈ ఉత్సవాలను నిర్వహించారు. ప్రకృతిని పరిరక్షించే పనిని హైడ్రా చేపట్టింది... ఆ ప్రకృతిలో అమ్మాయిలకు రక్షణగా మహిళా కమిషన్ పని చేస్తోంది. ఇలా ఇరు శాఖలు లక్ష్యాలు చాలా దగ్గరగా ఉన్నాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు అన్నారు. తల్లితనంలో ఉన్న మాధుర్యం వర్ణించలేమన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. పెళ్లి కళ కంటే తల్లి కళ చాలా వైభవంగా ఉంటుందని ఈ కార్యక్రమ నిర్వాహకులు, మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శ్రీమతి నేరెళ్ల శారద గారు అన్నారు. ప్రసంగాల అనంతరం బుద్ధ భవన్‌లో మహిళలు బతుకమ్మ ఆడారు.



# ఓజి 2 మీద పెరుగుతున్న ఆశలు

ఈ మధ్యకాలంలో బాగా పెరుగుతున్న ట్రెండ్ ఏంటంటే ఒక ఇమేజ్ ఉన్న హీరోతో సినిమా తీస్తున్నప్పుడే పార్ట్ 2కి ఛాన్స్ ఉండేలా క్లైమాక్స్ లో ట్విస్టు పెట్టేయడం. బొమ్మ బాగా ఆడితే క్రేజ్ ఉంది కదాని బాహుబలి, పుష్ప లాగా సీక్వెల్స్ కి వెళ్లిపోవచ్చు. లేదు ఏమైనా తేడా కొడితే అక్కడితో ఆగిపోవచ్చు. ప్రేక్షకులు మరిచిపోతారు. సమంత యశోద, కళ్యాణ్ రామ్ డెవిల్, చిరంజీవి గాడ్ ఫాదర్, విజయ్ దేవరకొండ కింగ్డమ్ ఈ కోవలోకే వస్తాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత లిస్టు ఉంది. వీటికి కొనసాగింపులు ఉండవనేది ఓపెన్ సీక్రెట్. ఇప్పుడు ఓజి వంతు వచ్చింది. ఒకవేళ యావరేజ్ అయ్యుంటే డిస్కషన్ అవసరం పడేది కాదు. కానీ సూపర్ హిట్ నుంచి బ్లాక్ బస్టర్ దిశగా అడుగులు వేస్తున్న ఓజికి కంటిన్యుయేషన్ ఖచ్చితంగా ఉండబోతోంది. దర్శకుడు సుజిత్ పలు ఇంటర్వ్యూలలో ఇదే చెబుతున్నాడు. ఇప్పుడొచ్చిన ఓజితో కలిపి మొత్తం మూడు భాగాలు తీసే ప్లానింగ్ ఉందట. ప్రస్తుతం జ్వరంతో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ మనసులో ఏముందో బయటికి వస్తే తప్ప ఓజి 2 ఎప్పుడనేది క్లారిటీ ఉండదు. ఇన్ సైడ్ టాక్ అయితే త్రివిక్రమ్, డివివి దానయ్య ద్వారా రెస్పాన్స్ తెలుసుకున్న పవన్ కళ్యాణ్ రెండో భాగం చేద్దామనే దిశగా సంకేతం ఇచ్చారట. కాకపోతే వెంటనే సాధ్యం కాకపోవచ్చు. ఎందుకో చూద్దాం. సుజిత్ ప్రస్తుతం న్యాచురల్ స్టార్ నానికి ఒక కమిట్ మెంట్ ఇచ్చాడు. బ్లడీ రోమియో అనే టైటిల్ ఆల్రెడీ ప్రచారంలో ఉంది. ది ప్యారడైజ్ పూర్తి కావడానికి ఇంకో అయిదు నెలల టైం ఉంది కాబట్టి ఈలోగా స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో సుజిత్ బిజీ అవుతాడు.



# బికిని ఫొటోలపై సాయి పల్లవి క్లారిటీ

పద్ధతైన పాత్రలు, అద్భుతమైన డ్యాన్సులు, క్లాసీ లుక్ వీటి గురించి మాట్లాడుకోగానే మొదట గుర్తుకు వచ్చేది హీరోయిన్ సాయి పల్లవి. సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ కోట్లాది మంది ఫ్యాన్స్‌ను తన సొంతం చేసుకున్న ఈ బ్యూటీకి సంబంధించి లేటెస్ట్‌గా బికిని ఫొటోలు వైరల్ అయ్యాయి. తన సోదరితో విదేశాలకు వెకేషన్‌కు వెళ్ళిన ఈ మలయాళ ముద్దుగుమ్మ.. బికినీ ధరించినట్లు కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ ఫోటో చూసిన ఆమె అభిమానులు.. తలలు పట్టుకుంటున్నారు. ఇవి నిజమైన ఫొటోలు కాకపోవచ్చు, ఎఐ ద్వారా క్రియేట్ చేసినవి కావచ్చు అంటూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా వీటిపై ఇన్‌డైరెక్ట్‌గా క్లారిటీ ఇస్తూ సాయి పల్లవి ఓ పోస్ట్ పెట్టింది. ట్రిప్‌కు సంబంధించిన పూర్తి వీడియోను షేర్ చేస్తూ.. 'పైన కనిపిస్తున్నవన్నీ నిజంగా తీసిన ఫొటోలు.. ఏఐ ఫొటోలు కాదు' అనే క్యాప్షన్ ఇచ్చింది. దీంతో.. ఆమె షేర్ చేసిన వీడియోలో బికిని ఫొటోలు లేకపోవడంతో.. బికిని ఫొటోలు ఏఐవి.. ఇప్పుడు తను షేర్ చేసినవి నిజమైనవి అంటూ క్లారిటీ ఇచ్చింది. దీంతో ఆమె బికిని ధరించలేదు అని క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

# ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి



బాలీవుడ్ యంగ్ బ్యూటీ సోనమ్ బజ్వా బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో తీరక లేకుండా గడుపుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న సినిమాల్లో 'నిక్కాజలిదార్-4' ఒకటి. ఈ సినిమా 'నిక్కాజలిదార్-3'కు సీక్వెల్‌గా రాబోతుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సిమెర్జిత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. రెజ్లింగ్ పై ఆసక్తి లేని ఓ పంజాబీ వ్యక్తి, ఉత్సాహభరితమైన హర్యాన్వీ స్త్రీని కలిస్తాడు. పరిచయం కాస్త ప్రేమగా మారిన తర్వాత తన ప్రపంచం మారిపోయినట్లుగా గ్రహిస్తాడు. వారు ప్రేమలో పడిన తర్వాత ఏం జరిగింది ఎలాంటి.. ప్రమాదాలు ఎదుర్కొన్నారనేది ఈ మూవీ కథ. దీనిని గున్బీర్ సింగ్ సిద్ధూ, మన్మోర్డ్ సిద్ధూ, అమ్నీత్ షేర్ సింగ్, రాంనీత్ షేర్ సింగ్ నిర్మిస్తున్నారు. ఇందులో సోనమ్ అమ్మీ విర్క్, నిర్మల రిషి, నిషా బానో, సోనియా కౌర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన సోనమ్ వరుస అప్డేట్‌స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈక్రమంలో.. తాజాగా, సోనమ్ బజ్వా 'నిక్కాజలిదార్-4'చిత్రానికి సంబంధించిన ఓ ప్రేమ పాట రాబోతున్నట్లు ప్రకటించింది. "సెప్టెంబర్ 28న విడుదలవుతున్న మా సినిమా పాటతో ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి. మీ హృదయాన్ని వెచ్చదనంతో నింపే మనోహరమైన ఈ సాంగ్‌ను మీ ప్లే లిస్ట్‌లో చేర్చుకోండి" అనే క్యాప్షన్ జత చేసింది.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in